క్లుప్తంగా

ఏపీ ఆగ్రోస్ చైర్మన్ ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న నవీన్‌నిశ్చల్

హిందూపురం: పట్టణంలోని పేట వెంకటరమణస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ ఆగ్రోచైర్మన్ నవీన్‌నిశ్చల్ పట్టణ ప్రముఖులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మూలవిరాట్ దర్శించుకుని రథోత్సవం వద్దకు చేరుకుని పూజలు చేశారు. మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవంలో అన్నదానం



ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టిఎన్.దీపిక, గుడ్డంవేణురెడ్డి తదితరులు

హిందూపురం: పేట వెంకటేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా శనివారం ఆలయం వద్ద పెద్ద ఎత్తున దాతలు అన్నదానాలు, మజ్జిగ, పండ్లరసాలు, పెసరపప్పు ప్రసాదాలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్ దీపిక ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అలాగే వాసవీక్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, నీటిప్యాకెట్లు అందజేశారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రసాదాలు, మజ్జిగను పంపిణీ చేశారు.

జగనన్నతోనే అన్ని వర్గాలకూ న్యాయం



సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

లేపాక్షి: సీఎం వైఎస్‌జగన్‌తోనే అన్ని వర్గాలకూ న్యాయం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డితో పాటు మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు అంజనరెడ్డి, లీలావతి, సర్పంచ్ ఆదినారాయణ మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు తెలియజేశారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పథకాలు అందించిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని పేర్కొన్నారు. కోఆప్షన్ సభ్యుడు బషీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ద్వారకనాథరెడ్డి, చలపతి, ఇర్ఫాన్, బోర్ల అంజినరెడ్డి, మాధవరెడ్డి, నిస్సార్, నరసప్ప, మోహన్, శ్రీనివాసులు, చంటి, తిప్పన్న, శంకరరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి

రొళ్ల: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని బీజీ హళ్లి ఆర్డీటీ కమ్యూనిటీ భవనం ఆవరణలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత దివంగత ఆర్డీటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆర్డీటీ చైర్మన్ మాట్లాడుతూ.. మహిళల అభివృద్ధి కోసం ఆర్డీటీ సంస్థ ప్రత్యేక చొరవ తీసుకుంటోందన్నారు. సంఘాల ద్వారా రుణాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఆర్డీటీ ద్వారా పిల్లల చదువుతో పాటు నిరుపేదలకు ఇళ్లు, రైతులకు డ్రిప్పు పరికరాలు అందించడం జరుగుతుందన్నారు. మహిళలకు ఆటల పోటీలను నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏటీఎల్ ఓబుళేష్, సీఓ కీర్తి, ఎస్టీఎల్ బాలయ్య పాల్గొన్నారు.

పొదుపు సంఘాలను బలోపేతం చేసుకోండి

రొళ్ల: గ్రామాల్లో డ్వాక్రా మహిళ సంఘాల సభ్యులు పొదుపు సంఘాలను బలోపేతం చేసుకోవాలని స్త్రీనిధి బ్యాంక్ మేనేజర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని వైకేపీ కార్యాలయ ఆవరణలో మహిళ సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. రుణాలను ప్రతి నెల సక్రమంగా కట్టుకొంటే వడ్డీ భారం తగ్గుతుందన్నారు. రుణాలను కుటుంబ అభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు గౌరమ్మ, సీసీలు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న చేసిన మేలు ప్రజలకు చెప్పండి

- మంత్రి ఉషశ్రీ చరణ్



మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్



హాజరైన పార్టీ కార్యకర్తలు, నాయకులు

సోమందేపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్లలో చేసిన మేలును అన్ని వర్గాల ప్రజలకు వివరించాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి, సమన్వయ కర్త ఉషశ్రీచరణ్ సూచించారు. శనివారం మండలంలోని నడింపల్లి, కేతగాని చెరువు, చాలకూరు, బ్రాహ్మణపల్లి, పందిపర్తి, ఈదుళ బలాపురం, జూలకుంట, మండ్లి, బ్రహ్మసముద్రం, గ్రామాల్లో ఆమె పర్యటించారు. పార్టీ శ్రేణులతో సమావేశం అయ్యారు. జరగబోవు సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కోరారు. మరో మారు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎం అయితేనే సుపరిపాలన సాధ్యమన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలతో ప్రజాధనం దోచుకున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లతో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించే పాలన కావాలంటే టీడీపీ, జనసేనకు వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం ఉంటుందని, కలిసి కట్టుగా పనిచేసి వైఎస్సార్ సీపీ జెండా మరో మారు పెనుకొండలో ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, సర్పంచ్‌లు నందిని, రామాంజినేయులు, లలితా, జీలాన్ ఖాన్, రామక్క, ఎర్రమ్మ, పరంధామ, కోఆప్షన్ సభ్యులు రఫీక్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు వేణు, సింగిల్ విండో చైర్మన్ ఆదినారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సోమశేఖర్, కిష్టప్ప, రామాకాంత్ రెడ్డి, కంబాలప్ప, లక్ష్మీనరసప్ప, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు నాగభూషణం రెడ్డి, సీనియర్ నాయకులు పోలేపల్లి నర్సింహులు, గజేంద్ర, చంద్ర శేఖర్, అదెప్ప, ఇమామ్‌వలి, ముత్యాలు, దాదాపీర్, మురళి, సదా తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే ధ్యేయం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని మంత్రి ఉషా శ్రీ చరణ్ తెలిపారు. బ్రహ్మణపల్లిలో ముస్లిం మత పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. టీడీపీ హయాంలో మైనార్టీలను పట్టించుకోలేదని, జగనన్న ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు సముచిత స్థానం కల్పించారని గుర్తు చేశారు.

నేడు మంత్రి పర్యటన

సోమందేపల్లి: మండలంలోని గుడిపలిల, తుంగోడు, వెలిదడకల గ్రామాల్లో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖామంత్రి, పెనుకొండ సమన్వయ కర్త ఉషా శ్రీ చరణ్ ఆదివారం పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకట రత్నం తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మదకశిర: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. శనివారం పట్టణంలోని 6వ వార్డులో పర్యటించారు. ప్రజలతో సమావేశమై సమస్యలను తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ.. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలు ఎప్పటికప్పుడు సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పట్టణంలో తాగునీటి సమస్య రాకుండా కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీధి దీపాలు సక్రమంగా వెలిగే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ పార్వతమ్మ, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పుట్టకామప్ప, స్థానిక నాయకులు దాసన్న, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



6వ వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

రేపు సమన్వయకర్త ఈరలక్కప్ప పర్యటన

అగళి: మండల పరిధిలోని పీ బ్యాడగెర, హెచ్‌డీహళ్లి గ్రామ పంచాయతీల్లో సోమవారం ఉదయం 10 గంటలకు సమన్వయకర్త ఈరలక్కప్ప పర్యటిస్తారని మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

అమరాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఆలదపల్లిలో నూతనంగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. గ్రామాల్లోనే వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో సచివాలయాలతో పాటు విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ క్లినిక్‌లో అర్హత కలిగిన వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎక్కడికి వెళ్లకుండా పైసా ఖర్చు లేకుండానే వైద్య సేవలతో పాటు మందులను ఉచితంగా పొందవచ్చని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. రాబోవు ఎన్నికల్లో జగనన్నను సీఎంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరిజమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు చిక్కన్న, ఎంపీటీసీ కెంచప్ప, మండల సచివాలయ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పీఆర్ డీఈ, ఏఈ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

వైఎస్సార్‌సీపీతోనే ప్రజాసంక్షేమం

గోరంట్ల: వైఎస్సార్‌సీపీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమైందని మంత్రి, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ భర్త చరణ్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని ఒకటోవార్డులోని అంజనేయస్వామి కాలనీ, మోహన్ రావు కాలనీ, చౌడేశ్వరీకాలనీలో సర్పంచ్ సరోజబాయి నేతృత్వంలో పార్టీ శ్రేణులతో కలిసి చరణ్‌రెడ్డి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. చరణ్‌రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాంనాయక్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్ సాహెబ్, గోరంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నూర్‌మహమ్మద్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ బాషా, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, స్థానిక ముఖ్య నాయకులు సచివాలయ మండల కన్వీనర్ సమరసింహ రెడ్డి, ఎంపీటీసీ జోన్న ఆంజనేయులు, కురబ సత్యనారాయణ, గంగూలి, భాస్కరరెడ్డి, జనార్దనరెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



గోరంట్ల చౌడేశ్వరీ కాలనీలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న చరణ్‌రెడ్డి తదితరులు

సిద్ధేశ్వర స్వామికి పూజలు

అమరాపురం: మండల పరిధిలోని హేమావతిలో వెలసిన సిద్ధేశ్వర స్వామిని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ, అర్చకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం స్వామికి ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభిషేకం, పూజలు చేయించారు. అంతకుముందు ఎమ్మెల్యే తిప్పేస్వామిని శాలువా పూలమాలలతో సన్మానించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రొళ్ల: మండల పరిధిలోని ఎం.రాయాపురం, అగ్రహారం, మల్లసముద్రం, జీరిగేపల్లి, బీజీ హళ్లి, హుణిసేకుంట, మల్లినమడుగు పోలింగ్ కేంద్రాలను సెక్టోరియల్ ఆఫీసర్ శ్రీధర్ పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, వెలుతురు, కిటికీలు, వాకిళ్లు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, ప్రహరీ తదితర వివరాలపై పాఠశాలల హెచ్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. చిన్నపాటి సమస్యలు ఉంటే పాఠశాల నిధులతో సరి చేసుకోవాలని హెచ్‌ఎంలకు సూచించారు.



రథోత్సవంలో పాల్గొన్న మంత్రి ఉషశ్రీ చరణ్



పావగడ: భక్తుల మధ్య సాగుతున్న రథోత్సవం

కమనీయం.. రథోత్సవం


పావగడ: శనీశ్వరస్వామి రథోత్సవం భక్తజన సందోహం మధ్య నేత్రపర్వంగా సాగింది. మాఘశుద్ధ పున్నమి శనివారం మధ్యాహ్నం 12 గంటలకు శనీశ్వర స్వామి, జ్యేష్ఠాదేవి ఉత్సవ విగ్రహాలను వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాద్యాల నడుమ రథంపై కొలువుదీర్చారు. భక్తులు అరటిపళ్లను రథంపైకి విసిరి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సమితి పదాధికారుల ఆధ్వర్యంలో శనిమహాత్మ సర్కిల్ వరకూ రథాన్ని లాగారు. శిరా రోడ్డులో భక్తుల సందర్శనార్థం నిలిచింది. అంతకుముందు ఆలయం లో స్వామి వారికి తైలాభిషేకం, సత్యనారాయణ వ్రతం, రథోత్సవాగమన, ఆవాహిత దేవతారాధన, సూర్యారాధన,ఆకుల పూజ, మహా మంగళారతి పూజలు జరిగాయి.


మడకశిర: పట్టణంలోని మిట్టబండ ఆంజనేయ స్వామి రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆంజనేయ స్వామికి వేదపండితుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, తైలాభిషేకం తదితర పూజలు జరిగాయి. మహామంగళ హారతి నిర్వహించి భక్తులకు ప్రసాదం అందజేశారు. హోమం నిర్వహించి సీతారాములు, ఆంజనేయస్వామి విగ్రహాలను ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేయించారు. అనంతరం వందలాది మంది భక్తులు రథాన్ని లాగారు. అయ్యప్ప స్వామి, బ్రాహ్మణ, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రొళ్ల: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్న శనేశ్వరస్వామి ఆలయ 36వ వార్షికోత్సవం వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. వేకువజాము నుంచే స్వామికి సుప్రభాత సేవలు, నవగ్రహారాధన, తులసీ పూజ, అంకురార్పణ, అభిషేకం తదితర పూజలు చేశారు. స్వామిని బంగారు ఆభరణాలతో పాటు పంచలోహ కవచాలతో అలంకరించి, హోమం చేపట్టారు.

రథోత్సవంలో పాల్గొన్న మంత్రి

సోమందేపల్లి: మండలంలోని మాగేచెరువులో కొల్హాపురి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త ఉషా శ్రీ చరణ్ హాజరయ్యారు. రథాన్ని మంత్రి కొద్దిసేపు లాగారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకట రత్నం, జెడ్పీటీసీ అశోక్ సింగిల్ విండో చైర్మన్ కొల్లప్ప, ఎంపీటీసీ నాగప్ప, నాయకులు నాగరాజు, బాషా, మురళి, మల్లి తదితరులు పాల్గొన్నారు.





మడకశిర: రథోత్సవంలో పాల్గొన్న భక్తులు , రొళ్ల శనేశ్వర ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

బీకే వర్గీయుల ఆశలపై నీళ్లు చల్లిన అధిష్టానం

పరిగి: పెనుకొండ నియోజకవర్గంలో కొంతకాలంగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. తమ వర్గానికి చెందిన జిల్లా పార్టీ అధ్యక్షుడు బీకే పార్థసారథికి టికెట్ వస్తుందని ఆయన వర్గీయుల ఆశలకు నీళ్లు చల్లుతూ అదే పార్టీకి చెందిన టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి సబితమ్మకు అధిష్టానం టికెట్ ఖరారు చేసింది. దీన్ని జీర్ణించుకోలేని బీకే పార్థసారథి వర్గీయులు విభేదించారు. శనివారం స్వయానా టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీరెడ్డి చేసిన వాఖ్యలే ఇందుకు నిదర్శనంగా నిలిచాయి. దీంతో టీడీపీలో పరిగి మండలంలో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. బలమైన వర్గంగా తమదంటూ భావిస్తున్న బీకే వర్గానికి షాక్ ఇస్తూ ఆ పార్టీ నిర్ణయంతో విస్తుపోయిన మండల టీడీపీ నాయకులు అధిస్టాన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు బహిరంగంగానే ప్రకటించడంపై పార్టీ వర్గాల్లో చర్చలకు దారితీశాయి. టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆపార్టీ వర్గాల్లో విబేధాలను మరోసారి బహిర్గతం చేశాయి.

సజావుగా ఎఫ్‌ఏ-4 పరీక్షలు

రొళ్ల: మండల వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలో ఎఫ్‌ఏ-4 పరీక్షలు ప్రారంభమయ్యాయి. బీజీ హళ్లి, అగ్రహారం, మల్లసముద్రం, జీరిగేపల్లి, మల్లినమడుగు తదితర ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న ఎఫ్‌ఏ-4 పరీక్షల నిర్వహణను ఎంఈఓ శ్రీధర్ పరిశీలించారు. మూల్యాంకనం, విద్యార్థుల ప్రగతితో పాటు మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. పాఠశాల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని తెలిపారు. మనబడి నాడు-నేడు రెండో దశ పనులు వేగవంతం చేయాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పరిగి: మండలంలోని మోదాలో ఎస్‌ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడులు చేసి, కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. గుర్రప్ప అనే వ్యక్తి నుంచి 80 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకోండి

పెనుకొండ: పట్టణంలో ఆదివారం గ్రూప్-2 పరీక్షలు రాసే అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాల సూపరింటెండెంట్ ఆదిశేషారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రూప్-2 పరీక్షలకు 300 మంది అభ్యర్థులు హాజరవుతున్నారన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లతో పాటు ఆధార్, డ్రైవింగ్ లైసెన్సు, పాన్‌కార్డు వెంట తీసుకురావాలన్నారు. అభ్యర్థులు సూచించిన సమయానికంటే గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

పెనుకొండ: డీఆర్‌డీఏ, సీడాప్ అనంతపురం ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఎస్ఆర్‌టీపీ స్కిల్ కాలేజ్‌లో సేల్స్ సూపర్‌వైజర్, ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు డీఆర్‌డీఏ, సీడాప్ పథక సంచాలకుడు నరసింహారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇచ్చి వందశాతం ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని ఈ నెల 29 లోపు అనంతపురం పంగల్ రోడ్డు దగ్గర ఉన్న టీటీడీసీ శిక్షణ కేంద్రంలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు మునీంద్ర సెల్: 8639439804, సాయికిరణ్ సెల్: 8074452233, మధుసూధన్ సెల్: 7730930919, లక్ష్మి సెల్: 7989479371 లో సంప్రదించాలన్నారు.

క్రిటికల్ కేర్ యూనిట్‌కు నేడు శంకుస్థాపన

హిందూపురం టౌన్: స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని మాతాశిశు కేంద్రం భవనంపై నిర్మించనున్న క్రిటికల్ కేర్ యూనిట్‌కు ఆదివారం శంకుస్థాపన జరగనుంది. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా రూ.23 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్‌ను నిర్మించనున్నారు. ఆదివారం మధ్యాహ్నం ప్రధాని నరేంద్ర మోదీ రాజ్‌కోట్ నుంచి వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేయనున్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్‌కుమార్ తెలిపారు.

జటాయువు ఘాట్ అభివృద్ధికి కృషి

లేపాక్షి: జటాయువు ఘాట్ అభివృద్ధికి కృషి చేస్తానని లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ తెలిపారు. శనివారం సాయంత్రం జటాయువు ఘాట్‌ను పరిశీలించారు. సొంత నిధులతో ఘాట్ పరిసరాలను పరిశుభ్రం చేసి కంపచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జటాయువు ఘాట్ చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి విద్యుత్, పర్యాటకులకు తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి కోసం ఇప్పటికే టీటీడీ దృష్టికి తీసుకెళ్లామని ఆయన పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పరిగి: మండలంలోని సేవామందిరంలో చలివేంద్రాన్ని ఎస్‌ఐ సత్యనారాయణ ప్రారంభించారు. సామాజిక సేవకుడు ఆనంద్ ఆధ్వర్యంలో మధుగిరి రోడ్డులో నిత్యం వేలాది మంది ప్రయాణికుల దాహార్తి తీరుస్తుండడం అభినందనీయమని ఎస్‌ఐ తెలిపారు. తొలి రోజు మజ్జిగ అందించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు హిదాయతుల్లా, జయలత, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం కేబుల్ అపహరణ

సోమందేపల్లి: మండలంలోని చిన్న బాబయ్యపల్లిలో పంచాయతీ తాగునీటి బోరు కేబుల్‌ను శుక్రవారం రాత్రి అపహరించారని సర్పంచ్ గంగమ్మ తెలిపారు. దాదాపు 20 వేల విలువజేసే కేబుల్ ఎత్తుకెళ్లారన్నారు.

మంచి అలవాట్లతో ఉత్తమ జీవితం

పరిగి: విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లతో మెలగాలని, అప్పుడే మనిషిని ఉన్నత స్థాయిలో నిలబెడతాయని ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని సేవామందిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మోటివేషన్ క్లాసు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరాపురాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం



విద్యార్థులతో ముచ్చటిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక

చిలమత్తూరు: సైబీరియన్ పక్షులకు నిలయమైన వీరాపురం, వెంకటాపురం గ్రామాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. ఆమె శనివారం సైబీరియన్ పక్షులను చూసేందుకు వీరాపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె పక్షులు ఇక్కడ ఎన్ని నెలలు ఉంటాయి, వాటికి ఆహారం, సౌకర్యాలు వంటి వాటిపై ఎంపీపీ పురుషోత్తమరెడ్డితో అడిగి తెలుసుకున్నారు. వలస పక్షులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు వాటికి ఆహార అవసరాలను తీరుస్తామని ఆమె తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి ఈ పక్షులను చూసేందుకు పర్యాటకులు వస్తుంటారని, వారి కోసం తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. అనంతరం ఆమె పాఠశాల విద్యార్థులను ఆప్యాయంగా పలకరించి ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు..కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి, నయిముల్లా తదితరులు పాల్గొన్నారు..

మండల సర్వసభ్య సమావేశం

పరిగి: మండల కేంద్రంలో మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఎంపీపీ సవిత అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో పలు అభివృద్ధి పథకాలతో పాటు రాబోవు మూడు నెలల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీరామప్ప, మండల ప్రత్యేకాధికారి ప్రసాద్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అశ్వమేధ బస్సులకు శ్రీకారం



జెండా ఊపి బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 5 నూతన అశ్వమేధ కేఎస్ ఆర్టీసీ బస్సులను స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ శనివారం ప్రారంభించారు. స్థానిక మున్సిపల్ బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పావగడకు 15 బస్సులు అడిగానని అయితే ప్రస్తుతానికి 5 బస్సులు మంజూరు చేశారని తెలిపారు. ధర్మస్థలం, బెంగుళూరు, తుమకూరు ప్రాంతాలకు ఈ బస్సులు నడుపడం జరుగుతుందన్నారు. పట్టణంలోని పాత సంత మైదానంలో కేఎస్ ఆర్టీసీ బస్టాండ్‌ను త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. అనంతపురం, పెనుగొండ, ధర్మవరం ప్రాంతాలకు కూడా కేఎస్సార్టీసి బస్సులు నడపడానికి చర్యలు చేపట్టామన్నారు. అలాగే చిక్కహళ్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నాగలాపురంలో రూ.13 లక్షలతో నిర్మించనున్న పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు సుదేశ్ బాబు, శంకరరెడ్డి, ఎగువపల్లి నాని, రాజేశ్, టెంకాయల రవి తదితరులు పాల్గొన్నారు.